

# విశ్వనరుడు

-డా.దిలావర్

ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

నేను నాయక్ హోదాలో లద్దాక్‌లోని ఒక రెజిమెంట్‌లో జాయినయ్యాను. అక్కడ హవల్దార్ హర్‌భజన్‌సింగ్, లాన్స్ నాయక్ గన్నర్ వడివేలూ పరిచయమయ్యారు.

ఒకరోజు గుడారంలో రిలాక్స్‌డ్‌గా కుర్చీలో కూచుని ఆలోచిస్తున్నాను. అప్పుడు హైదరాబాద్‌లో జరిగిన ఒక సంఘటన గుర్తొచ్చింది.

రవీంద్రభారతిలో ఏదో ప్రోగ్రాం ఉందంటే నేను, కొందరు ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్ళాను. ఎవరో పేరున్న రచయిత్రి కాబోలు... గంభీరంగా ఉపన్యసిస్తోంది.

“మహామహా కవులు కూడా, లేని విశ్వనరుణ్ణి ఊహించుకుని తెగ కవిత్వం రాశారు. స్త్రీల సమస్యల్ని చిత్రించిన వారు ఒక్కరూ లేరు. పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీని కేవలం భోగ్య వస్తువుగానే చూశారు. మీదు మిక్కిలి ఇండియాలో ఉన్న కుల వ్యవస్థను పూర్తిగా విస్మరించారు...” వీరావేశంతో చెప్పుకుపోతున్నది రచయిత్రి.

ఆమె ప్రసంగం వింటూంటే నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. ‘విశ్వనరుడు’ అన్నది కేవలం ఊహాజనిత పదమేనా? అబ్రహాం లింకన్, కెనడీని హతమార్చేస్తే మనం చలించిపోయాం. ఎందుకు? లుముంబాను, మార్టిన్ లూథర్ కింగ్‌ను హత్య చేస్తే మనం గర్హించాం. ఎందుకు? కెన్‌సారో వివాను ఉరితీస్తే ప్రపంచమంతా ముక్తకంఠంతో ఖండించింది. ఎంచేత? సద్దాం హుస్సేన్‌ను పదవీచ్యుతుణ్ణి చేస్తే మనకేం నొప్పి? ప్రపంచం మారుమూల ప్రాంతంలో ఎక్కడ ఏ అన్యాయం జరిగినా విశ్వమంతా సంఘీభావం చూపుతోంది... ఎందువల్ల?

“హవల్దార్ సాబ్ ఆప్‌కో బులారహే హై...” అన్న జవాను కేకతో నా ఆలోచనలు తెగిపోయాయి.

యుద్ధం లేకున్నా ఇక్కడ ప్రశాంతంగా గడపడానికి లేదు. సైన్యం ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిందే. బార్డర్‌లో నిరంతరం కాల్పులు జరుగుతూనే ఉంటాయి. ఆ కవ్వింపు కాల్పులు రావణాసురుని కాష్ఠంలా ఎప్పుడూ ప్రజ్వరిల్లుతూనే ఉంటాయి. మృత్యువు ఘంటికా నాదలు విరామం లేకుండా వినిపిస్తూనే ఉంటాయి.

మేమున్నది ‘లేహ్’ పట్టణ ప్రాంతంలో. ఎత్తైన పర్వతాలు, లోతైన లోయలూ, గంభీరంగా కనిపించే సరస్సులతో ప్రకృతి వింత సోయగాలు పోతుందిక్కడ. సముద్ర మట్టానికి 12000 అడుగుల ఎత్తులో ఉంది మేమున్న స్థావరం. ప్రాణవాయువు అందడం కష్టం. మానవత్వం లేని శాడిస్టులా చలి చల్లని కోత కోస్తూ ఉంటుంది.

దూరంగా ఆగిఆగి తుపాకుల శబ్దం వినిపిస్తున్నది. రెండో బంకర్‌లో హవల్దార్ హర్‌భజన్‌సింగ్, లాన్స్ నాయక్ గన్నర్ వడివేలు, ఇంకా ఇద్దరు ముగ్గురు జవాన్లు మెషిన్‌గన్లు పొజిషన్‌లోకి తీసుకొని కూచొని ఉన్నారు.

నేను బైనాక్యులర్స్‌తో చుట్టూ గాలిస్తున్నాను. తుపాకుల శబ్దం రానురాను దగ్గరవుతున్నది. ఉన్నట్టుండి ప్రచండ వేగంతో వచ్చిన ‘షెల్లింగ్స్’ బంకర్ ముందు అమర్చిన ఇసుక బస్తాల పక్కన విస్ఫోటిస్తున్నాయి. ఫిరంగి గుండ్లు మమ్మల్ని వెదుక్కుంటూ వచ్చి పడుతున్నాయి. బదులుగా మా వైపు నుండి ట్యాంకర్లు గర్జించాయి. మెషిన్‌గన్లు నిప్పులు చిమ్ముతూ పేలుతున్నాయి. అంత భయంకరమైన పరిస్థితిలో కూడా ట్రక్కులు ఆయుధాలను, సామాన్లను, ఆహారాన్ని చేరవేస్తూనే ఉన్నాయి.

బుల్లెట్ కడుపులోకి దూసుకుపోయినప్పుడు సిపాయి రక్తం కక్కుకున్నట్టు, సూర్యుడు తన కడుపులోకి దూసుకుపోగానే ఆకాశం రక్తం కక్కుకుంటున్నట్టుంది. సంజెవేళ దాటి రెండు మూడు గంటలయిన తరువాత తుపాల రణగొణ ధ్వని కాస్త సద్దుమణిగింది. హవల్దార్ నన్ను పెట్రోలింగ్‌కు వెళ్ళవలసిందిగా ఆదేశించాడు. రక్తం గడ్డ కట్టించే చలి. తాత్కాలికంగా చలికి విరుగుడైన ‘మందు’ను బాగా పట్టించిన నలుగురైదుగురు జవాన్లను తీసుకొని ఉత్తర దిశగా బయలుదేరాను.

రాత్రి అయిందంటే, అదో భయంకరమైన అనుభవానికి పురుడు పోస్తుంది. ప్రత్యేకించి ఈ రాత్రి దడ పుట్టిస్తున్నది. కీచురాళ్ళ రొద గుండెల్ని పీచుపీచు మనిపిస్తున్నది. ఎక్కడో కొండచరియలు విరిగి పడుతున్న భయంకర శబ్దం. పౌర్ణమి వెళ్ళి రెండు మూడు రోజులే అయినట్టున్నది. పుచ్చపువ్వులా వెన్నెల కాస్తున్నది. దూరంగా అక్కడక్కడా విసిరేసినట్టున్న మట్టి ఇళ్లు కనిపిస్తున్నాయి. ఎక్కడా జనసంచారం లేదు. మేం నెమ్మదిగా ముందుకు కదులుతున్నాం. సింధు నదితో ఝన్‌స్కార్ నది సంగమించే ప్రదేశం చేరుకున్నాం. నదీతరంగాల గలగలలు లయబద్ధంగా వినిపిస్తున్నాయి.

అక్కడికి దగ్గరలోనే తుప్పల్లో ఒక స్త్రీ ఆర్తిగా... రక్షించమని కాబోలు... కేకలు పెడుతున్నది. అది డోంగ్రీనో, కాశ్మీరమో, లద్దాఖీనో, ఉర్దూనో, చైనా భాషో తెలియడంలేదు. అంతా కలగాపులగంగా వినపడుతున్నది. ఏ ప్రాణి అయినా ప్రాణభయంతో వేసే కేకలకు భాషతో నిమిత్తం లేదేమో.

మా వాళ్ళు అప్రయత్నంగా గన్లను చేతుల్లోకి తీసుకున్నారు. వాళ్లను కాల్చవద్దని సైగ చేశాను. కేకలు వినిపిస్తున్న తుప్పల వైపు మెల్లగా నడుచుకుంటూ వెళ్ళాం.

నలుగురైదుగురు జవాన్లు - దక్షిణం వైపు నుండి పెట్రోలింగ్‌కు వచ్చిన వాళ్లు, ప్రాణభయంతో తల్లడిల్లుతున్న జింకపిల్ల మీదికి ఆకలిగొని పంజా విసిరే పులుల్లా ఆ స్త్రీని చుట్టుముట్టారు. అపర దుశ్శాసనుల్లా వారామెను దాదాపుగా వివస్త్రను చేశారు. సిగ్గుతో చితికిపోతూ మమ్మల్ని చూసి ఆమె రెండు చేతులు జోడించింది. ఆమె కళ్ల నుండి ధారాపాతంగా వర్షిస్తున్న కన్నీరు వెన్నెట్లో స్పష్టంగా కనిపిస్తున్నది.

నా మనోఫలకం మీద ఓ క్షణం మా అమ్మ రూపం కదలాడింది.

“ఠైరో... ఛోడో ఉసే...” అన్నాను అధికార స్వరంతో.

వాళ్ళు బాగా నిషాలో వున్నారు. పైగా కళ్లకు కామం పొరగప్పి అన్నూమిన్నూ కానకుండా ఉన్నారు.

“యే... దుష్మన్‌కీ ఔరత్ హై... నహీ ఛోడేంగే...” అన్నాడొకడు.

“ఔరత్ హై...” అన్నాను మెల్లగా.

నాతో వచ్చిన జవాన్లు కూడా మెల్లగా వాళ్ళతో కలిసిపోయారు. ఆడ స్పర్శ సోకక చాలా రోజులైందేమో. ఆవురావురుమంటున్న వాళ్ల కళ్లలో ఆకలి - కసి - కలగలిసిన ఎర్రని జీర.

“నోనో... ఆమె శత్రువులకు చెందిన స్త్రీ అయినా ఇప్పుడు ఒంటరిగా ఉన్న నిస్సహాయురాలైన ఒక అబల. మీరిప్పుడు ఆమెకు అపకారం తలపెట్టడం అమానుషం...” అన్నాను వారిస్తూ.

“హట్‌జావో...” అంటూ నన్ను దూరంగా తోసేశాడొకడు.

“నా ప్రాణం పోయినా సరే. ఆమెను కాపాడి తీరుతాను” అన్నాను. నా గొంతులోంచి స్థిరంగా వచ్చిన ఆ మాటలు నాకే ఆశ్చర్యం గొలిపాయి.

“షరమ్ నహీ ఆతీ... నువ్వు ఇండియన్‌వి కావా?” కోపంగా అన్నాడొకడు.

“కాను” పక్కన బాంబు పేలినట్టు అదిరిపడ్డారు వాళ్లు.

“అంటే... నువ్వు ఏపీకో, తమిళనాడుకో, కర్ణాటకకో, కేరళకో చెందిన సౌత్ ఇండియన్‌వి కావా?”

“కాను”

“నార్తరన్?”

“నో”

“మరి... దుష్మన్‌వా?” హేళన చేస్తూ ఇంకొకడు.

దుష్మన్ అంటే ఎవరు? ఎవరు ఎవరికి దుష్మన్? శత్రుత్వమెరుగని రెండు మానవ సమూహాల మధ్య ఏ రాజకీయ కారణాల వల్లనో సంభవించే యుద్ధమే కదా ప్రధాన శత్రువు...

“మనిషిని” స్థిమితంగా అన్నాను. ఆ స్త్రీని సమీపించి

దుస్తులు అందించాను. వాళ్ళకు ఎదురుగా నిలబడి చేతులు అడ్డంగా చాపి "నా కంఠంలో ప్రాణం వుండగా మీరేమెను ఏమీ చేయలేరు" అన్నాను నిశ్చయంగా.

"దుష్మన్ హై... సాలా..." అంటూ కసిగా తుపాకితో నన్ను కాల్చాడొకడు. వెంట్రుక వాసితో గురితప్పి నా భుజంలోకి బుల్లెట్ దూసుకుపోయింది. నెమ్మదిగా వాళ్ళు తుప్పల్లోకి జారుకున్నారు. నేను స్పృహ తప్పి పడిపోయాను.

సూర్య కిరణాలు నులివెచ్చగా ముఖం మీద పడటంతో మెల్లగా కళ్ళు తెరిచాను. అతి కష్టం మీద వైర్‌లెస్ సెట్‌తో కెప్టెన్‌కు కబురందించాను. బ్రిగేడ్ కమాండర్ ఆదేశంతో అంబులెన్స్ వచ్చి నన్ను బేస్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళింది.

వారం రోజుల తరువాత కొంచెం కోలుకున్నాను.

బెడ్ మీద విశ్రాంతి తీసుకుంటున్న నా మనసు పొరలను చీల్చుకొని జ్ఞాపకాలు... జ్ఞాపకాలు... అమ్మ జ్ఞాపకమొస్తున్నది... యుద్ధం ఆమెకు మిగిల్చిన శిథిల జీవితం జ్ఞాపకమొస్తున్నది... అమ్మ చెప్పిన తన విషాద గాథ జ్ఞాపకమొస్తున్నది...

"బిడ్డా! అంతర్యుద్ధంలో నా భర్తను కోల్పోయాను. మత ఛాందసుల ఆంక్షలతో నా జీవితం కకావికలమైంది. చదువుకోడానికి లేదు. స్వేచ్ఛగా తిరగడానికి లేదు. అలంకరించుకోవడానికి లేదు. ఓ ఆటా లేదు. పాటా లేదు. ఆడదాని దుర్భర జీవితానికి మహోన్నత ఉదాహరణ నా దేశం! కరెంటు లేదు. గ్యాస్ స్టౌ లేదు. ఆ దరిద్రంలోనే.. ఆ అంధకారంలోనే మగ్గిపోవలసి వచ్చింది.

ఆ రోజు... దినబత్తెం కోసం ఊరంతా పిచ్చిదానిలా తిరిగాను. మూటలు మోశాను. పిండి రుబ్బాను. లోగిళ్లు ఊడ్చాను. పాచిపని చేశాను. ఆనాటి రొట్టెలకు కావలసిన పిండి సంపాదించాను. కోట్లు సంపాదించిన రాజకీయ నాయకుడిక్కూడా అంత సంతృప్తి ఉంటుందో లేదో... జీవితాన్ని ఆ ఒక్క రోజైనా జయించానన్న సంతోషం అశ్రువుల రూపంలో బహిర్గతమైంది. ఉరుకు లాంటి నడకతో ఇల్లు చేరుకున్నాను. నా బిడ్డల కోసం రొట్టెలు చేశాను. సాయంత్రం వరకూ నా ఇద్దరు కొడుకుల కోసం - ఇద్దరు కూతుళ్ళ కోసం... ఎదురుచూస్తూనే ఉన్నాను. నిర్దయగా ఆపరేషన్ చేసే డాక్టర్ లాంటిది కాలం. అది క్షణాలుగా, నిమిషాలుగా, గంటలుగా, రోజులుగా దొర్లిపోతూనే ఉంటుంది. నా పిల్లలు ఏమై పోయారో నాకు ఈనాటికీ తెలియదు. నా కళ్లలోని నిరీక్షణ, గుండెలో మినుకు మినుకుమనే ఆశ - ఈనాటికీ సజీవంగానే ఉన్నాయి.

డాక్టర్ గాయానికి కుట్లు కుట్టినట్టు గుండె గాయానికి కాలం కుట్లు వేసింది. మళ్ళీ నేను బతుకు పోరాటంలో కూరుకుపోయాను. మునిమాపు వేళ కొండల మీది ముళ్లపొదల్ని గొడ్డలితో నరికి వాటితో వంట చేసుకోవడం నిత్యకృత్యమైంది. ఆ రోజు ముళ్ళ పొదల వెంట తిరుగుతున్నాను. ముందు పరచుకున్న బతుకు ఒక ముళ్లపొద అవుతుందని ఆ క్షణంలో నాకు తెలియదు. దుర్విధి సైనికుల రూపంలో నన్ను వెంటాడింది. ఏ దేశం సైనికులో - ఏ జాతో - ఏ మతమో - యుద్ధంతో ఏ మాత్రం ప్రమేయం లేని నేను వాళ్ళకెలా శత్రువునయ్యానో నాకు అంతుబట్టలేదు. వాళ్ళ క్రూర మృగాలు వేటాడినట్టు నా బతుకును వేటాడారు. అన్యాయంగా నేను వాళ్ళ కామానికి బలి కావలసి వచ్చింది. నా బతుకు ముళ్లపొదల్లో చిక్కుకున్న గుడ్డ ముక్కైపోయింది.

స్పృహ తప్పిన నేను కళ్లు తెరిచేసరికి ఓ శరణార్థుల శిబిరంలో ఉన్నాను.

ఆ సైనికుల చేతుల్లో చచ్చిపోయినా బాగుండేది. ఈ శిబిరంలో క్షణం క్షణం చస్తూ బతికే దుర్భర పరిస్థితి తప్పేది.

ఒకరోజు భోరున వర్షం కురిసింది. చిల్లుల గుడారం బయట ఎలా ఉందో లోపలా అలాగే ఉంది. అంతా జలమయం. నేలంతా చిత్తడిచిత్తడిగా ఉంది. కొంచెం సేపటికి పెనుగాలులు వీచాయి. నామమాత్రంగా వున్న ఆ కాస్త టెంటు కూడా ఎగిరిపోయింది. వర్షంలో తడిసి ముద్దయ్యాం. రివ్వున వీచే చలిగాలులకు రంపంతో కోస్తున్నట్టుగా ఉంది. ఏ క్షణాన ప్రాణం విడవవలసి

దిక్కుతోచని అయోమయ పరిస్థితిలో సముద్రం మీద ప్రయాణిస్తున్న ఒక నౌకలోకి వందలాది మంది శరణార్థులు చొరబడి ప్రపంచం నలుమూలలకు చెల్లాచెదరుగా చెదరిపోయారు. అలా నేను ఇండియాకు చేరుకున్నాను.

వస్తుందోనన్న భయం వెన్నులో పాకుతోంటే చావు రాకా - బతకలేక మేం అనుభవించిన మరణ యాతన శత్రువులక్కూడా వద్దని భగవంతునికి దండం పెట్టుకున్నాం.

ఇక మంచు వర్షం కురిసినప్పుడు మేం పడ్డ పాట్లు చెప్పనలవి కానివి. కొంకర్లు పోతున్న కాళ్లు - చేతులతో - ఎముకలు కొరికే చలిలో మృత్యువుతో పోరాడవలసి వచ్చేది. నా పక్కన ఓ కుటుంబం పసిపిల్లలతో వున్నది. పిల్లలకు న్యూమోనియా సోకింది. తట్టుకోని పిల్లల ఏడ్పులు, ఎంత కఠినాత్ముల గుండెలనైనా ద్రవింపజేస్తాయి. వైద్య సౌకర్యం లేదు. మందులిచ్చే నాథుడు లేడు. ఆశను చంపుకోలేక ఆ పిల్లల తల్లిదండ్రులు మందుల కోసం, రక్తం గడ్డకట్టే చలిలో శిబిరం నుండి శిబిరానికి వెళుతూ అనుభవించిన నరకయాతన వర్ణనాతీతం. చివరకు వాళ్లు చేసిన ప్రయత్నాలన్నీ వృథాప్రయాస కాగా... పిల్లల శవాలు కూడా పూడ్చిపెట్టే వీలులేక... కుక్కలకూ... తోడేళ్లకూ... ఆహారంగా వదిలేయడం తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్లు జలదరిస్తుంది. గర్భశోకంతో ఆ తల్లిదండ్రులు ఎంతగా తల్లడిల్లిపోయారో ప్రత్యక్షంగా చూసిన వాళ్లకే తెలుస్తుంది.

ఆహారం లేక మూడు రోజులు - నాలుగు రోజులు పస్తులుండవలసి వచ్చేది. ఆహారం తీసుకొచ్చే ట్రక్కుల కోసం కళ్లలో వత్తులు వేసుకొని ఎదురుచూసేవాళ్లం. హెలికాప్టర్లు జారవిడిచే ఆహారపు పొట్లాల కోసం, నీళ్ల పొట్లాల కోసం - కుక్కల్లా పందుల్లా కాట్లాడుకునే వాళ్లం. ఈ ఆకలి ఉంది చూశావూ...? కన్నబిడ్డల్నే ఆరగించే క్రూరమైన పులి లాంటిది. విష సర్పం లాంటిది. సర్వస్వం కోల్పోయి నిండా విషాదంలో మునిగిపోయిన వారిని కూడా - అన్నీ మరచిపోయి తన కోసం తపించిపోయేట్టు చేయగలుగుతుంది ఈ ఆకలి. చలీ - ఆకలి తోడు దొంగల్లా మా ఆత్మస్థైర్యాన్ని దోచుకునేవి. మృత్యువు అంచుల దాకా వెళ్లిన ప్రాణాలను మూడు రోజులకోసారి లభించే పులిసిన రొట్టె ముక్కలతో లాగి ఒడ్డున పడేసేవాళ్లం...

కొడుకుల్ని కోల్పోయిన తల్లులు, తల్లులు లేని అనాథ బాలలు, భర్తలు పోయిన భార్యలు, అందర్నీ పోగొట్టుకున్న వృద్ధులు... అరుపులు... ఏడ్పులు... పెడబొబ్బలు... శోకం... దుఃఖం... ఘనీభవించిన విషాదం... పురుగులతో లుకలుకలాడే వ్రణంలా భయానకంగా ఉండేది శిబిరం.

పులి మీద పుట్రలా రోజూ నన్ను జ్వరం పరామర్శించి వెళ్ళేది. ఒక్కోసారి తల తిరిగి పడిపోయేదాన్ని. నోరంతా పిడచగట్టుకు పోయి వికారంగా వుండేది. అన్నం సయించేది కాదు. నరనరాన నీరసం ఆవహించేది. ఆ భయంకర - బీభత్స వాతావరణంలోనే... మానవత్వం ఏ మాత్రం లేని సైనికుల పైశాచిక అత్యాచారం వల్ల - అన్నెం పున్నెం ఎరుగని నువ్వు నా కడుపున బడ్డావని తెలుసుకున్నాను. కొడిగట్టిన నా జీవితంలో మళ్ళా మినుకు మినుకు మనుకుంటూ ఏ మూలనో ఆశ ప్రజ్వరిల్లడం మొదలెట్టింది. ఛిద్రమైపోయిన బతుకులోంచి జీవన శకలాలను ఏరుకోవడానికి సర్వసన్నద్ధమయ్యాను.

నీకో విషయం తెలుసా? ఎక్కడ ఏ యుద్ధం జరిగినా ముందుగా బలిదానమయ్యేది ఆడదే. యుద్ధంలో చచ్చేవాడికో - చంపేవాడికో జన్మనిచ్చే ఆడదే. బోస్నియా, రువాండా, చెచెన్యా, కొసావో, కాశ్మీర్, ఆఫ్ఘనిస్తాన్, పాలస్తీనా, ఇజ్రాయెల్, శ్రీలంక, పాకిస్తాన్, ఇండియా, ఇరాక్... పేర్లేవైనా కాని... ప్రదేశాలేవైనా కాని... పర్యవసానం అంతటా ఒక్కటే. ఏ యుద్ధంలోనైనా దిక్కులేకుండా మిగిలేవి స్త్రీల శిథిల జీవితాలే. జీవితాల్ని పునర్నిర్మించుకోడానికి వీలు కానంతగా - గుడ్డల్ని చీలికలు, పీలికలు చేసినట్టు స్త్రీల దేహాల్ని ఛిద్రం చేస్తారు.

ఉన్నట్టుండి మరొక ఉపద్రవం ముంచుకొచ్చింది. గుర్తింపు కార్డు కోసం అధికారులు వేధించడం మొదలు పెట్టారు. ఏ అత్యాచారానికి గుర్తింపు? ఏ కాందిశీక జీవితానికి గుర్తింపు? ఏ అనామక జన్మలకు గుర్తింపు? ఏ ఛిద్రానికి గుర్తింపు? ఇంకా ఏం మిగిలి వుందని గుర్తింపు? ఇంకా ఏం మిగిలి వుందని గుర్తింపు? గడ్డిపోచ కూడా ఆధారం లేకుండా సముద్రంలో మునిగిపోతున్న వాడికి ఇంకా ఏ గుర్తింపుతో ఏం ప్రయోజనం...?

దిక్కుతోచని అయోమయ పరిస్థితిలో సముద్రం మీద ప్రయాణిస్తున్న ఒక నౌకలోకి వందలాది మంది శరణార్థులు చొరబడి ప్రపంచం నలుమూలలకు చెల్లాచెదరుగా చెదరిపోయారు. అలా నేను ఇండియాకు చేరుకున్నాను.

నవమాసాలు మోసి, నీకు జన్మనిచ్చి, పెంచి పెద్ద చేశాను. బిడ్డా! తండ్రిలేని నీ వల్ల నేను ఎన్ని అవమానాలను భరించానో! తండ్రి తెలియని నువ్వు అగ్నిపర్వతాన్ని దాచుకున్నట్టు ఎంతటి అవమానాన్ని గుండెల్లో దాచుకున్నావో! బిడ్డా! ఇలాంటి దయనీయ పరిస్థితి ఇంకే ఆడపిల్లకూ రాకూడదు. మాటివ్వు... నీ వల్లగాని... చివరకు నీ కళ్ల ఎదుట ఇంకెవరి వల్లగాని... ఇలాంటి అన్యాయం ఏ ఆడదానికి జరక్కూడదు..." అమ్మ చెప్పిన మాటలు గుర్తు కొచ్చి చలించిపోయాను. కళ్ల వెంబడి ధారాపాతంగా కన్నీళ్లు కారిపోతున్నాయి.

ఆలోచనలు ధారావాహికంగా దాడి చేస్తున్నాయి. నా తండ్రి ఎవరు? అతని దేశం ఏది? జాతి ఏది? మతం ఏది? ఏ కులం? ఏ ప్రాంతం? నాది ఏ దేశం? ఏ మతం? ఏ జాతి? ఏ ప్రాంతం? ఏ దేశానికి నేను శత్రువును? ఏ దేశానికి నేను ముద్దుబిడ్డను? నేనెవరిని? నేనెవరిని?? నేనెవరిని...??? నా మెదడులోని నరాలు చిట్లిపోతున్నాయి.

★